# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### 10 హెచ్‌పీ మోటరు పెడితే భూమిలో నీళ్లే ఉండవు



సాగుకు 3 గంటల కరెంట్ ఇస్తే రైతుల బతుకులు ఆగమే. తెలంగాణ రాక ముందు మాకు పొలం, నీటి సదుపాయం ఉన్నా.. వరి వేసుకొని తిండిగింజలు పండించు కుందామన్నా కరెంటు సరిగా లేక పోవడంతో ఉన్న పొలాన్ని ఎండబెట్టినం. సాగుకు ఇచ్చే ఐదు, ఆరు గంటల కరెంట్ కూడా సగం పగలు, సగం రాత్రి ఇచ్చేది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత 24 గంటల కరెంట్ ఇస్తుండడంతో ఇప్పుడు మొత్తం వరిపంటే పండించుకుంటున్నం. తిండి గింజలు ఉంచు కొని మిగతావి అమ్ముకుంటున్నం. కానీ మళ్లీ కాంగ్రెస్‌వాళ్లు 3 గంటల కరెంట్ ఇస్తం. 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలని చెబుతున్నరు. అంత పెద్ద మోటరు మా బోర్లకు పెడితే ఉన్న నీళ్లన్నీ గుంజేస్తయి. ఆ తర్వాత ఏం చేయాలో వాళ్లే చెప్పాలె. ఇప్పుడున్న 24 గంటల కరెంటే కరెక్ట్. అందుకే సీఎం కేసీఆర్‌కే మా మద్దతు ఉంటుంది.

– చెన్ను గోవింద్‌రెడ్డి, రైతు, బట్టుగూడెం, పెద్దవూర మండలం



స్వరాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ అందుతున్నది. దాంతో రైతులు ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగు చేసుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా నాలుగైదు గంటల కరెంట్, రాత్రి పూట పొలాల్లో పడిగాపులు, ఎరువులు, విత్తనాల బాధలు, ధాన్యం కొనుగోళ్ల కష్టాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల జీవితాల్లో నిప్పులు పోసేందుకు కాంగ్రెస్ కంకణం కట్టుకున్నది. 24 గంటల కరెంట్ అవసరం లేదని, 10 హెచ్‌పీ మోటర్లు కొనుక్కుంటే 3 గంటలు చాలని అంటున్నది. దీనిపై రైతులు భగ్గుమంటున్నారు. 10 హెచ్‌పీ మోటర్లకు అయ్యే ఖర్చు ఎవడిస్తడని నిలదీస్తున్నారు. నాడు కాంగ్రెస్ పాలనలో రాత్రిపూట కరెంటు కోసం పడిగాపులు కాసి కరెంట్ షాక్, పాము, తేలు కాట్లతో ఎంతో మంది రైతులు చనిపోయిన ఘటనలు ఇంకా మర్చిపోలేదని దుమ్మెత్తిపోస్తున్నారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్‌ను కచ్చితంగా ఓడిస్తామని స్పష్టం చేస్తున్నారు.

# 10 హెచ్‌పీ మోటర్లకు పైసలెవడిస్తడు..?

## కాంగ్రెస్ కుట్రలపై భగ్గుమంటున్న రైతులు

### గతంల రాత్రంతా జాగారం చేసేటోళ్లం



ప్రస్తుతం 24 గంటల ఉచిత కరెంట్‌తో రెండు కార్లు సాగు చేసుకుంటున్నం. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ చాలంటున్నడు. అసలు ఆయనకు వ్యవసాయం మీద కనీస అవగాహన లేదు. రైతులు 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోమని చెప్పడం చిన్న రైతులను ముంచుడు తప్ప ఇంకోటి కాదు. తెలంగాణలో 3, 5 హెచ్‌పీ మోటర్లతోనే వ్యవసాయం సాగుతున్నది. రేవంత్‌రెడ్డి చెప్పినట్లు 10 హెచ్‌పీ మోటరు పెట్టాలంటే లక్ష రూపాయాల పెట్టుబడి అవుతుంది. పైపులు, కరెంట్ కనెక్షన్, ఇవన్నీ మరీ ఖర్చుతో కూడిన పని. గతంలో కాంగ్రెస్ పాలనలో రాత్రిళ్లు పొలాలకు నీరు పెట్టడానికి పోయి రాత్రి అక్కడే పడుకునేటోళ్లం. అంత కష్టపడితే రెండు, మూడు మడులే తడిసేవి. పంట చేతికోచ్చే వరకు నమ్మకం ఉండేది కాదు. తెలంగాణ ఏర్పడినంక కేసీఆర్ సీఎం అయినంక వ్యవసాయాన్ని పండుగలా చేసిండు. రైతులంతా సంతోషంగా ఉన్నరు. ఓట్లప్పుడు వచ్చే కాంగ్రెసోళ్లను నమ్మేది లేదు. ఆ పార్టీ పాలన ఎట్లుంటదో మాకు తెలుసు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే మద్దతిస్తాం.

–పంగ లాలయ్య, రైతు, గుమ్మడవెల్లి, కొండమల్లేపల్లి మండలం

### మూడు గంటల్లో అర ఎకరం కూడా పారదు



వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతదని కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉంది. మూడు గంటల కరెంట్‌కు కనీసం అర ఎకరం కూడా తడువదు. గతంలో కాంగ్రెస్ పరిపాలన చూసిన రైతులు మళ్లీ ఆ పార్టీ పాలన రావాలని ఎన్నడూ కోరుకోరు. అప్పట్లో రాత్రి వేళ కరెంట్ ఇవ్వడంతో మోటర్లు పెట్టేందుకు చీకట్లో బావులు, బోర్ల వద్దకు వెళ్లి ఇబ్బందులు పడ్డరు. చీకట్లో కరెంటు వైర్లు తగిలి విద్యుత్‌షాక్‌తో, విషపురుగుల కాటుతో ఎంతో మంది రైతులు చనిపోయినరు. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ పాలనలో వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తుండడంతో రైతుల ఇబ్బందులు తీరాయి. ఇప్పుడు రాత్రి వేళల్లో బావుల కాడికి పోవాల్సిన అవసరం లేదు. పగటి పూటే ఏదో ఒక సమయంలో సరిపోయేంత నీళ్లు పెట్టుకుంటున్నం. గిప్పుడు మళ్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలి. మూడు గంటలే కరెంట్ ఇస్తం అంటూ రైతులను అవమాన పర్చేలా మాట్లాడడం సరికాదు. రైతులందరూ ఆయనకు ఓటుతో బుద్ధి చెబుతరు. రైతులను ఆదుకుంటున్న సీఎం కేసీఆర్‌కే మా మద్దతు.

–శాగం కోటిరెడ్డి, రైతు, తిరుమలగిరి(సాగర్)

### కాంగ్రెస్ వస్తే వలసలు తప్పవు

వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తే సాగు ముందు పడదు. ఒక వేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మాత్రం రైతుల వలసలు తప్పవు. ప్రస్తుతం తెలంగాణలో 24 గంటల కరెంట్ ఇస్తున్నరు. సరిపోను నీరు, రైతుబంధు సాయం వస్తుండడంతో సాగు బాగా సాగుతున్నది. రైతులం రెండు కార్లు పండించుకొని మంచిగా బతుకుతున్నం. కాంగ్రెస్ వాళ్లు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నరు. ఇప్పటి వరకు మనకాడ అలాంటి మోటర్లే లేవు. దానిమీద ఎవరికీ అవగాహనే లేదు. బావిలో పెద్ద మోటరు పెడితే గంట, గంటన్నరలోనే మొత్తం నీటిని గుంజేస్తయి. బాయి అడుగంటుతది. తర్వాత ఏం చేయాలి. గతంలో కాంగ్రెస్‌వాళ్ల పాలన ఎటుందో రైతులకు తెలుసు. కరెంటు లేక పొలం పారక అప్పుల పాలై వేరే రాష్ట్రాలకు వలస పోయి పనులు చేసుకొని బతికినం. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ వాళ్లు రైతులను ముంచేలా పథకాలు పెడుతున్నరు. వాళ్లను నమ్మి ఇబ్బంది పడలేం. తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇవ్వడంతో గతంల బీళ్లుగా ఉన్న భూములన్నీ సస్యశ్యామలమైనయ్. బీఆర్‌ఎస్ ప్రభుత్వమే మళ్లీ రావాలి.

– బంటు యాదగిరి, రైతు, వేములపల్లి



### 10 హెచ్‌పీ మోటర్లు మేము కొనలేం



వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తాం. 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాలని, వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడడం సరికాదు. సాగుగురించి తెల్వని రేవంత్‌రెడ్డి మా ఊరికి వచ్చి చూస్తే తెలుస్తది. మా బోర్లల్లో 10 హెచ్‌పీ మోటరు పెడితే పనిచేస్తదా. మూడు గంటల కరెంట్‌తో పంటలు సాగు అయితయా. మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకోవడం కాదు. రైతుల కష్టాలు తెలిసి వారిని ఆదుకునే నాయకులే కావాలి. గతంలో కాంగ్రెస్ పాలనలో కరెంట్ సరిగా ఇవ్వక పోవడంతో నానా అవస్థలు పడ్డం. వచ్చే పోయే కరెంట్‌కు మోటర్లు కాలిపోయి, నీరు పారక పంటలు ఎండిపోయి అప్పుల పాలైనం. మా బాధలు, కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ సాగుకు 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. దాంతో మంచిగా రెండు కార్లు సాగు చేసుకుంటున్నం. మళ్లి కాంగ్రెస్ వాళ్ల మాటలు నమ్మే పరిస్థితిలో రైతులు లేరు. రైతులంతా కేసీఆర్ వైపే ఉన్నరు.

– లక్మానాయక్, రైతు, రూప్లాతండా, త్రిపురారం మండలం

### 10 హెచ్‌పీ మోటరు ఏడికెళ్లి తేవాలె



ప్రస్తుతం సీఎం కేసీఆర్ 24 గంటల ఉచిత కరెంటు ఇస్తుండడంతో రెండు పంటలు మంచిగ పండుతున్నయ్. పంట సాగు చేసినప్పటి నుంచి కోతకొచ్చే వరకు సరిపోను నీళ్లు పెట్టుకోగలుగుతున్నం. దానికి తోడు రైతుబంధు సాయం కూడా చేస్తుండడంతో పెట్టుబడికి అప్పులు తెస్తలేం. పంట అమ్ముకుంటే మాకు చేతిల నాలుగు పైసలు ఉంటున్నయ్. గతంల కాంగ్రెస్‌వాళ్ల పాలనలో సరిగ కరెంట్ లేక రాత్రి, పగలు బాయికాడనే కాపలా కాసి మోటర్లు పెడితే ఎకరం కూడా సాగు కాక పోయేది. పంట పెట్టుబడికి చేసిన అప్పులు కూడా తీరక నానా అవస్థలు పడ్డం. ఇప్పుడేమో 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోండి.. మూడు గంటల కరెంటు సరిపోద్ది అంటున్నరు. అసలు 10 హెచ్‌పీ మోటరు ఎక్కడి నుంచి తేవాలె. అప్పట్ల ఆరు గంటలిస్తేనే పంటలు ఎండిపోయినయ్. మరి మూడు గంటల కరెంట్ ఎట్లా సరిపోతది. అసలు వారికి వ్యవసాయం గురించి ఏం తెలుసని మాట్లాడుతున్నరో ఏమో అర్థం కావట్లే. ఎవరెన్ని మాటలు చెప్పినా సీఎం కేసీఆర్ వల్లే రైతులు బాగుపడ్డరు.. అందుకే మా ఓటు ఆయనకే వేస్తం.

– చెరుకు అంకులయ్య, రైతు, నల్లచెలమూల, చందంపేట మండలం

# ధరణి తీసేస్తే.. భూములు బీడే...?




## కాంగ్రెస్ తీరుపై రైతన్న ఆగ్రహం

రైతుల భూములకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో భూములపై రైతులకు సర్వహక్కులు సమకూరాయి. అలాంటిది కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని ఆ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పాలనలో కాంగ్రెస్ హయాంలో పటేల్, పట్వారీ వ్యవస్థతో పడిన కష్టాలు చాలని, మళ్లీ అలాంటి ఇబ్బందులు పడలేమని పేర్కొంటున్నారు. భూ రికార్డుల తప్పిదాలతో నిత్యం కొట్లాటలు, కేసులతో పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి అలిసిపోయామని, మళ్లీ కాంగ్రెస్ వస్తే ఎనుకటి రోజుల మాదిరి ఆ బాధలు పడలేమని చెప్తున్నారు. ధరణి పోర్టల్‌తో భద్రంగా ఉన్న భూములను మాయం చేయాలని చూసే కాంగ్రెసోళ్లకు ఓటుతోనే బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నారు.

### రైతులు బాగు పడడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు



సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల భూ సమస్యలు లేవు. గతంలో భూముల పట్టాల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఒకే భూమిని ఇద్దరుచ, ముగ్గురి పేరుమీదికి మార్చేటోళ్లు. దాంతో ఊర్లలో తీవ్రమైన గందరగోల పరిస్థితులు ఉండేవి. ధరణి వచ్చినంకనే ఈ పరిస్థితి లేకుండా పోయింది. ఎవరి భూమి వారి పేరునే ఉండేలా చేశారు. ధరణితోనే ప్రతి రైతుకు సరిగా రైతుబంధు డబ్బులు అందుతున్నాయి. ఇప్పుడు ధరణిని ఎత్తివేస్తామని కాంగ్రెస్ పార్టీ వాళ్లు చెప్పడం వారి అవివేవకం. ధరణి తీసేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి. భూముల సర్వే నంబర్లు మారుతయ్. మళ్లీ మధ్య దళారులు వస్తరు. కౌలుదారు చట్టం తెస్తే భూ యజమానులకు, కౌలుదారులకు నిత్యం గొడవలే. ఏదేదో చెప్పి రైతులను మోసం చేయాలని చూసే కాంగ్రెస్‌ను రైతులు నమ్మే పరిస్థితి లేదు. రైతుల కోసం పనిచేస్తున్న సీఎం కేసీఆర్ మళ్లీ రావాలని కోరుకుంటున్నాం.

–కర్ర రుక్మారెడ్డి, రైతు, బొప్పారం, కేతేపల్లి మండలం

### రైతుల బాగు చూడలేకే ధరణి తీసేస్తామంటున్నరు



రైతులు బాగు పడడం కాంగ్రెస్ వాళ్లకు ఇష్టం లేదు. అందుకే రైతులకు మంచి చేస్తున్న ధరణి తీసేస్తమంటున్నరు. ధరణి తీసేస్తే రైతుల భూములు మళ్లీ పెత్తందారుల చేతిలోకి వస్తయ్. గతంల కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతుల సమస్యలు పట్టించుకోలేదు. తెలంగాణ రాక ముందు భూములు అమ్మాలన్నా, కొనాలన్నా దళారులను ఆశ్రయించాల్సి వచ్చేది. వాళ్లు వేల రూపాయలు తీసుకొనేటోళ్లు. ఆ తర్వాత రికార్డుల్లో మార్చేందుకు కూడా నెలల తరబడి ఆఫీసు చుట్టూ తిరిగేది. ఇప్పుడు ధరణితో తాసీల్దార్ కార్యాలయంలోనే అరగంటలోనే భూములను రిజిస్ట్రేషన్ చేసి పేపర్లు చేతిలో పెడుతున్నారు. మ్యుటేషన్ సైతం వెంటనే అవుతుంది. ఒక్క రోజులోనే పాస్ బుక్కు కూడా వస్తుంది. ధరణి రావడంతోనే రైతుల కష్టాలు పోయినై. ధరణి తెచ్చిన బీఆర్‌ఎస్‌కే ఓటేస్తం.

– షేక్ శంకర్, రైతు, ముదిమాణిక్యం, అడవిదేవులపల్లి మండలం

### ధరణి పోర్టల్‌కు వేరేది సాటిరాదు



గతంలో భూముల విషయంతో అధికారులు నానా ఇబ్బందులు పెట్టినరు. ఒకరి భూమి ఇంకొకరికి రాయడంతో మళ్లీ వాళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చింది. సీఎం కేసీఆర్ సార్ తీసుకొచ్చిన ధరణితో మా ఇబ్బందులు తీరినై. ధరణి వచ్చినంకనే నాలాంటి పేద రైతులు గుండెమీద చెయ్యి వేసుకొని నిర్భయంగా ఉంటున్నం. మా భూముల వివరాలు ఆన్‌లైన్‌లోనే ఉండడంతో ఎప్పుడు పడితే అప్పుడు చెక్ చేసుకోవచ్చు. గతంల మా పొలం మా పేరుతోనే ఉందా లేదా అని ఎప్పుడూ రికార్డులు చూడాలని ఆఫీసుల చుట్టూ తిరిగేటోళ్లం. బాగా పలుకుబడి ఉన్నోళ్లు అధికార్లతో కుమ్మక్కై రికార్డుల్లో భూములను తారుమారు చేసేటోళ్లు. భూములు అమ్మాలన్నా.. కొనాలన్నా ఇబ్బందిగానే ఉండేది. ఇప్పుడు ధరణితో రైతుల భూములు మారి పేరుతోనే ఉంటున్నయ్. మేము వేలిముద్ర వేయకుండా ఎవ్వరూ దానిని మార్చే పరిస్థితి లేదు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ధరణిని తీసేస్తామంటున్నరు. ధరణి తీసేస్తే రైతులకు మళ్లీ కష్టాలే. రైతుకు సీఎం కేసీఆర్ అన్ని విధాల మంచి చేస్తుండు. మళ్లీ ఆయనకే మద్దతిస్తాం.

–పగిడి కొండలు, రైతు, దామరచర్ల

### ధరణి లేకుంటే దళారుల రాజ్యమే



ధరణి ద్వారా రైతులకు ఎంతో మేలు కలుగుతున్నది. ధరణితో భూ సమస్యలు ఇట్టే పరిష్కారమవుతున్నాయి. కేవలం ఒక్క పూటలోనే పట్టా మార్పిడి, రిజిస్ట్రేషన్ పని పూర్తవుతుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో నా భూమి వేరే వ్యక్తికి పట్టా మార్పిడి చేయాలంటే నానా ఇబ్బందులు పడినం. ఇప్పుడు నేను రిజిస్ట్రేషన్ ఆఫీసుకి వెళ్లి వేలు పెడితేనే మరొక వ్యక్తికి పట్టా అయ్యే అవకాశం ఉంటుంది. ధరణి ద్వారా లక్షల మంది రైతులు లబ్ధి పొందారు. గతంలో ధరణి లేకపోవడంతో రైతులు పట్టాలు చేయించుకోవాలంటే రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా, డబ్బులు ఇచ్చినా పని అయ్యేది కాదు. సీఎం కేసీఆర్ సారు తీసుకొచ్చిన ధరణి ద్వారా ఇప్పుడు రైతులకు అలాంటి ఇబ్బందులు లేకుండా పోయాయి. కాంగ్రెస్ నాయకులు ధరణిని రద్దు చేస్తామని చెబుతున్నారు. అదే చేస్తే మళ్లీ దళారులు రాజ్యం వస్తది. అప్పుడు రైతులకు మళ్లీ ఇబ్బందులు తప్పవు. వాళ్ల దోపిడీకి రైతులు బలి కావాల్సి వస్తది. మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తది. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో మేము మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయానికి వెళ్లితే కేవలం అరగంటలోనే రిజిస్ట్రేషన్, పట్టా మార్పిడి అయిపోయాయి. ఇలాంటి ధరణితోనే రైతులకు లాభం కలుగుతుంది.. కాంగ్రెసోళ్లు తీసుకొచ్చే దాంతో కష్టాలే ఉంటాయి. ధరణితో రైతుబంధు నగదు కూడా సకాలంలో అందుతుంది. నేరుగా మేమే బ్యాంకులకు వెళ్లి డబ్బులు తీసుకుంటున్నాం. రైతులకు ఎలాంటి కష్టం లేకుండా ధరణి పోర్టల్ ఉపయోగపడుతుంది.

– పిట్టల అనిల్, రైతు, తోపుచర్ల, మాడ్గులపల్లి

### మళ్లీ వెనుకటి రోజులు మాకొద్దు

ధరణి వచ్చినంకనే రైతుల జీవితాలు కుదుటపడ్డయ్. మా భూములకు ఏం ఢోకా లేదని ధైర్యంగా ఉంటున్నం. సీఎం కేసీఆర్ రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కష్టాలను తీర్చేందుకు ధరణి పోర్టల్ తీసుకొచ్చినరు. వ్యవసాయ భూముల వివరాలు ఒకే చోట పొందుపర్చి అన్నీ ఆన్‌లైన్‌లో పెట్టినరు. దాంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే కష్టాలు పోయాయి. రైతులు వచ్చి వేలిముద్ర వేస్తేగాని భూమి పట్టా మార్పిడి జరుగదు. ధరణి ద్వారానే రైతుబంధు డబ్బులు పక్కాగా మా ఖాతాలో పడుతున్నయి. అదే కాంగ్రెస్ హయాంలో అన్ని అవకతవకలే. భూముల రికార్డులు సరిగా లేక ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు రాయించుకున్నరు. దాంతో నిత్యం భూ పంచాయితీలే అయ్యేవి. ఇప్పుడు ధరణి పోతే మళ్లీ అలాంటి కష్టాలే వస్తయ్. అలాంటి కాంగ్రెస్ పాలన మాకొద్దు.. సీఎం కేసీఆర్ పాలనే మళ్లీ కావాలి.

– గంట వెంకట్‌రెడ్డి, జువ్విగూడెం, నార్కట్‌పల్లి మండలం

